# సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం : 21 : ఆగస్టు : 2023




## క్రీడలకు సన్నాహాలు

మహబూబ్‌నగర్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు సన్నాహాలు ప్రారంభిస్తున్నారు.

వివరాలు 8లో ▸



## గుప్తనిధుల వేటలో..

గుప్తనిధుల తవ్వకాలతో మూసాపేటలోని రామలింగేశ్వర ఆలయం ధ్వంసమవుతోంది.

వివరాలు 10లో ▸


గరిష్టం/కనిష్టం 33.4 /24.1

## వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

# పంటల లెక్క.. పక్కా

- క్రాప్ బుకింగ్‌లో కొత్త విధానం
- ఏఈఓ యాప్‌లోనే న్యూ మాడ్యుల్
- పొలాల నుంచే ఆన్‌లైన్
- పంటల డాటాతో మార్కెటింగ్ నదుపాయానికి అవకాశం





రంగాపూర్ క్లస్టర్‌లో క్రాప్ బుకింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

అచ్చంపేట: క్రాప్ బుకింగ్‌లో ప్రభుత్వం నూతన విధానం తీసుకువచ్చింది. ఇందుకోసం ఏఈఓ యాప్‌లో కొత్త మాడ్యుల్ ఏర్పాటు చేసింది. దీంతో పంట లెక్క ఇక్క పక్కాగా తేలనుంది. రాష్ట్రంలో ప్రతీ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టేందుకు నిర్ణయించి. ప్రభుత్వం ట్రయల్ రన్ షురూ చేసింది. అయితే జిల్లాలో చాలా మంది పాత విధానంలో అప్‌లోడ్ చేయడంతో కొత్త విధానం అమలు కావడం లేదు.

**గతంలో ఇలా..**

ఓ గ్రామానికి వెళ్లిన వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) ఆయా సర్వేనంబర్లలో రైతులు ఏయే పంటలు సాగు చేశారనేది నమోదు చేసి వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. అయితే ఏఈఓ పంటల వద్దకు వెళ్లి కనుచూపు మేర ఒకటే పంట కనిపిస్తుండడంతో రైతులు అదే పంట ఎక్కువస్థాయిలో పండించారని నామమాత్రంగా నమోదు చేసేవారు. దీంట్లో పంట ఖచ్చితత్వం అనేది ఉండదు. తద్వారా ప్రభుత్వానికి ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయనే విషయంలో పూర్తిస్థాయిలో స్పష్టత ఉండేది కాదు.

**ఇప్పుడొక లెక్క..**

క్రాప్ బుకింగ్ ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పుడొక్క లెక్క. ప్రభుత్వం యాప్‌లో కొత్త మాడ్యుల్ తీసుకొచ్చింది. ఇందులో తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లితేనే ఈ వివరాలు నమోదు చేసుకునే విధంగా ఉండడంతో ఏఈవోలు పొలంబాట పట్టాల్సిన పరిస్థితి. ప్రస్తుతం జిల్లలోనే కాకుండా రాష్ట్రం మొత్తంగా ఈవిధానంపై ట్రయల్ రన్ కొనసాగుతుంది. ఇందులో ఎదురయ్యే లోటుపాట్లు సవరించుకున్న తర్వాత త్వరలోనే దీన్ని అమలు పర్చనున్నారు.

### కొత్త విధానం

జిల్లాలో 143 క్లస్టర్లకు ఏఈవోలు ఉన్నారు. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ఉండగా,కొన్నింటిలో అంతకు మించి గానీ,తక్కువ కూడా ఉన్నాయి. కొత్త యాప్‌లో సర్వే నంబర్లన్నీ ఎరుపు రంగులో దర్శమిస్తాయి. ఏఈఓలు ఒక సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు అందులో మూడు పట్టాభూములు ఉంటే రెండు పట్టా భూముల వివరాలు నమోదు చేసిన పక్షంలో ఆ సర్వే నంబర్ రంగు ఎరుపు నుంచి పసుపుకు మారుతుంది. ఒకవేళ వంద శాతం ఆ సర్వే నంబర్లలో క్రాప్ బుకింగ్ పూర్తయితే ఆకుపచ్చ రంగులోకి మారిపోతుంది. తద్వారా ఆక్కడ పంట నమోదు పూర్తిస్థాయిలో జరిగిందని అర్థం. ఇలా కొత్త విధానం ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉంది. దీనికి సంబంధించి అచ్చంపేట మండలం రంగాపూర్ క్లస్టర్‌లో వ్యవసాయాధికారి కృష్ణయ్య శుక్రవారం ప్రయోగాత్మకంగా అమలు చేసి చూశారు. దీని లోటు పాట్లను ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఆ తర్వాత పూర్తిస్థాయిలో అమలు పర్చనున్నారు.

### కచ్చితత్వం కోసమే..



క్రాప్ బుకింగ్ ఖచ్చితత్వం కోసమే కొత్త యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తుంది. ప్రధానంగా పంట నమోదు సరైనా స్థాయిలో జరిగితే దిగుబడి ఎంత వస్తుందనేది ఒక అంచనా ఉంటుంది. చా లెక్కన ప్రభుత్వం పంటల కొనుగోలు, ఇతరత్రా అంశాల్లో ఆ వివరాలు ఉపయోగపడతాయి.

– వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి

### పొలాలకు వెళ్లాల్సిందే..

ఏఈఓలకు యాక్టీవ్ లాగర్ యాప్‌ను ఇదివరకు నుంచి ట్యాబ్‌లలో ఉపయోగిస్తున్నదే. దీంట్లోనే వారు హాజరుతోపాటు రోజువారి విధులకు సంబంధించి రైతుబీమా, రైతుబంధు ఆప్‌డేట్ నమోదు చేసి పంపించేవారు. ఇందులోనే క్రాప్ బుకింగ్ కూడా చేపట్టేవారు. అయితే ఇది క్షేత్రస్థాయి వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఏఈఓలు వివరాలు నమోదు చేసే విధంగా ఉంది. ఈక్రమంలో ఇందులో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం ఖచ్చితంగా ఆ సర్వే నంబర్ వరకు వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కనిపించేలా మాడ్యుల్‌ను రూపొందించింది. ఉదాహరణకు.. ఒక ఏఈఓ ఒక సర్వే నంబరుకు వెళ్లాల్సి వచ్చినప్పుడు గూగుల్‌లో జియోఫెన్స్ ద్వారా ఆ లోకేషన్‌కు చేరుకోవచ్చు. 50 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు ఆ సర్వే నంబర్ వివరాలు ట్యాబ్‌లోని యాప్‌లో కనిపిస్తాయి. అప్పుడే పంట నమోదు వివరాలు నమోదు చేయవచ్చు. ఆలా కాకుండా ఎక్కడో ఉండి వివరాలు నమోదు చేద్దామంటే ఇకపై కుదరదు.

# ఎవరికో.. లక్కు కిక్కు

## నేడు కలెక్టరేట్‌లో లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాల ఎంపిక



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ లక్కీ డ్రా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న టెండర్‌దారులు
- అవసరమైన ఏర్పాట్లు చేసిన ఎక్సైజ్ అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 230 దుకాణాలకు 8,595 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.171.90 కోట్ల ఆదాయం

మహబూబ్‌నగర్ క్రైం/నాగర్‌కర్నూల్ క్రైం/అచ్చంపేట: మద్యం దుకాణాల లైసెన్స్ దక్కించుకునేందుకు పోటీపడిన వారిలో అదృష్ట లక్ష్మి ఎవరిని వరిస్తుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఉమ్మడి జిల్లాలో 230 దుకాణాలకు గాను 8,595 మంది టెండర్లు వేయగా.. ప్రభుత్వానికి రూ.171.90 కోట్ల ఆదాయం వచ్చింది. ఒక్కో దుకాణానికి సగటున 40 దరఖాస్తులు రాగా.. ఇందులో ఒక్కరిని మాత్రమే అదృష్టం వరించనుంది. అయితే ఆ ఒక్కరు ఎవరు అనే దానిపై మద్యం వ్యాపారుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇందుకు సంబంధించి సోమవారం ఉదయం 11 గంటలకు ఆయా జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లో లాటరీ పద్ధతి ద్వారా కలెక్టర్లు ఎంపిక చేయనున్నారు.

### సిండికేటుగా టెండర్లు

మద్యం దుకాణాల టెండర్లను దక్కించుకునేందుకు ఎక్కువ శాతం మంది వ్యాపారులు జట్టుగా కలిశారు. సిండికేట్‌గా మారి ఒక్కో దుకాణానికి ఇద్దరు, నలుగురు, ఆరుగురు చొప్పున సంఖ్యను పెంచుకుంటూ ఒక జట్టుగా కలిసి టెండర్లు వేశారు. ధరావత్ సైతం రూ.2 లక్షలకు పెంచడంతో టెండర్ల విషయంలో పొదుపుగా.. జాగ్రత్తగా వ్యవహరించడం కనిపించింది. గతంలో ఏకంగా 30 వరకు టెండర్లు వేసిన వారు ఇప్పుడా సంఖ్యను సగానికి తగ్గించుకున్నారు. ఆ ఐదింటిలో ఏదో ఒక దుకాణం దక్కకుండా పోతుందా..? అనే ఆశతో ఉన్నారు. దుకాణాలు కేటాయించిన తర్వాత అయ్యే సిండికేట్ ఈసారి ముందే అయ్యారు. ఫలానా చోట నువ్వు చేయి.. ఫలానా చోట నేను దరఖాస్తు చేస్తాను.. ఎక్కడ వచ్చినా అంతా కలిసి పంచుకుందాం అని ఒప్పందం చేసుకుని టెండర్లు వేశారు. ఈసారి చాలా మంది మహిళల పేర్లతో టెండర్లు దాఖలు చేశారు. వేర్వేరుగా, కలిసికట్టుగా టెండర్లు వేసినా.. దుకాణాలు చేజిక్కిన తర్వాత మరో సిండికేటుకు నిర్వహణ అప్పగించేలా ముందస్తు ఒప్పందాలు చేసుకోవడం గమనార్హం. ఈ దిశగా పలువురు వ్యాపారులు జోరుగా మంతనాలు చేస్తున్నారు.

### కలెక్టర్ సమక్షంలో డ్రా..

లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాల ఎంపికకు ఏర్పాట్లు పూర్తి చేశాం. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తాం. దరఖాస్తుదారులు ఉదయం 11 గంటల వరకు వేదిక వద్దకు చేరుకోవాలి. ఎంట్రీపాస్ ఉన్నవారు మాత్రమే లోపలికి రావాలి. కార్లు, ద్విచక్రవాహనాలు ఏవీ కూడా కలెక్టరేట్ లోపలికి అనుమతి లేదు. పోలీస్ బందోబస్తు, అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ ఉంటుంది. టెండర్ వచ్చిన వారు డబ్బులు చెల్లించడానికి ఎస్‌బీఐ బ్యాంకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తోంది. టెండర్ వచ్చిన వ్యాపారులు ఏడాదికి సంబంధించిన ఫీజులో 1/6 వంతు చెల్లించాలి.

– దత్తరాజ్‌గౌడ్, ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా డీసీ

### ఆ దుకాణాలకు డిమాండ్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న మద్యం దుకాణాలకు ఈసారి చాలా డిమాండ్ ఏర్పడింది. గద్వాల జిల్లా పరిధిలోని ఉండవెల్లి 28వ దుకాణానికి 99 టెండర్లు రాగా.. 31వ దుకాణానికి 72, 29వ దుకాణానికి 65, జింకలపల్లిలోని 58, జడ్చర్లలోని 39వ దుకాణానికి 68, రాజాపూర్‌లోని 43వ దుకాణానికి 65 టెండర్లు వచ్చాయి. మారుమూల ప్రాంతాల్లో చాలా తక్కువగా టెండర్లు పడ్డాయి. ఇందులో అచ్చంపేటలోని తుర్కపల్లి 63వ దుకాణానికి 10, అమ్రాబాద్ 64వ దుకాణానికి 11, మన్ననూర్ 65వ దుకాణానికి 16, పదర 66వ దుకాణానికి 16 దరఖాస్తులు వచ్చాయి. లింగాల 31వ దుకాణానికి 11, అదే మండలంలోని అంబట్‌పల్లి 37వ దుకాణాకి 12 టెండర్లు వచ్చాయి.

➪ మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని దుకాణాలతోపాటు జడ్చర్ల, రాజాపూర్, కోయిలకొండ, మిడ్జిల్ దుకాణాలకు అధికంగా టెండర్లు వచ్చాయి. నారాయణపేట జిల్లా కృష్ణలోని 73వ దుకాణానికి 71 టెండర్లు వచ్చాయి. నంచర్ల గేట్ దగ్గర ఉన్న 80వ దుకాణానికి 52, గండేడ్ 90వ దుకాణానికి 56, కోయిలకొండలో ఉన్న రెండు దుకాణాలకు కలిపి 126 టెండర్లు వచ్చాయి.

| జిల్లా | మద్యం దుకాణాలు | వచ్చిన టెండర్లు |
|---|---|---|
| మహబూబ్‌నగర్, పేట | 90 | 3,571 |
| నాగర్‌కర్నూల్ | 67 | 2,524 |
| వనపర్తి | 37 | 1,329 |
| జోగులాంబ గద్వాల | 36 | 1,171 |

### పారదర్శకంగా నిర్వహణ..

లక్కీడిప్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తిగా వీడియో చిత్రీకస్తారు. ముందుగా ఇచ్చిన ఎంట్రీ పాస్ ఉన్నవాళ్లను మాత్రమే టెండర్లు నిర్వహించే హాల్‌లోకి అనుమతిస్తారు. ఒక్కో దుకాణానికి వచ్చిన దరఖాస్తుల ప్రకారం వారికి ఇచ్చిన టోకెన్ నంబర్ల క్రమ సంఖ్య ఆధారంగా మూడుసార్లు పిలుస్తారు. వారి ఎదుటే ఆయా దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ప్రకారం టోకెన్లు వేసి లక్కీడిప్ తీసి ఎంపిక చేస్తారు. డ్రా తీసే సమయంలో సంబంధిత దుకాణానికి దరఖాస్తు చేసుకున్న వారు విధిగా అక్కడుండాలి. వారిలో ఎవరు రాకున్న డ్రా తీస్తారు. ఒకవేళ గైర్హాజరైన దరఖాస్తుదారుడికి లక్కీడిప్‌లో కేటాయింపు జరిగితే ఆ టెండర్‌ను రద్దు చేస్తారు. మళ్లీ డ్రా తీసి కొత్త వ్యక్తులకు దుకాణం కేటాయిస్తారు.

➪ డ్రాలో ఎంపికైన దరఖాస్తు దారుడు ఆ దుకాణానికి నిర్ణయించిన రెండేళ్ల లైసెన్స్ రుసుం మొత్తంలో 1/6 భాగాన్ని అదేరోజు సాయంత్రంలోగా బ్యాంకులో చలాన్ లేదా డీడీ రూపంలో తీసి అబ్కారీ శాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు రాత్రి వరకు బ్యాంకులో ఈ చలాన్లు, డీడీ తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లో బ్యాంకు పూచీకత్తు ఇవ్వాల్సి ఉంటుంది.

## లక్కీ డిప్‌కు ఏర్పాట్లు పూర్తి

నాగర్‌కర్నూల్ జిల్లాలో 67 మద్యం దుకాణాలకు వచ్చిన 2,524 దరఖాస్తులకు సోమవారం సమీకృత జిల్లా సముదాయ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి షేక్ ఫయాజుద్దీన్ తెలిపారు. ఆదివారం సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో లక్కీ డ్రాకు నిర్వహించే ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 67 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే లక్కీ డ్రాకు 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఎక్సైజ్ స్టేషన్ల వారీగా లక్కీ డ్రా నిర్వహిస్తామని ముందుగా నాగర్‌కర్నూల్ పరిధిలోని పది దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహిస్తామని, అందుకు సంబంధించిన దరఖాస్తుదారులనే హాల్లోకి అనుమతిస్తామన్నారు. పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తామని, హాజరయ్యే టెండర్‌దారుల వాహనాలకు వైభవ్ ఫంక్షన్ హాల్ చుట్టుపక్కల ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. లక్కీ డ్రాలో మద్యం దుకాణాలకు ఎంపికైన టెండర్ దారులు తప్పనిసరిగా అదే రోజు మొదటి విడత ఇన్‌స్టాల్‌మెంట్ రూ.9.17లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, అందుకు అక్కడే బ్యాంకు వారి ఆధ్వర్యంలో అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

## న్యూస్‌రీల్

### సీడబ్ల్యూసీలో వంశీచంద్‌రెడ్డికి చోటు



కల్వకుర్తి: కాంగ్రెస్ పార్టీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వర్కింగ్ కమిటీ సీడబ్ల్యూసీలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపికయ్యారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుకు సంబంధించిన ప్రకటనను విడుదల చేశారు. ఈయన స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం శేరిఅప్పారెడ్డిపల్లి. వంశీచంద్‌రెడ్డి చిన్న వయసులోనే పార్టీ విద్యార్థి విభాగంలో అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో ఎన్ఎస్‌యూఐలో చేరారు. ఆ తర్వాత 2004 వరకు గాంధీ మెడికల్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం వచ్చిన ఎన్నికల్లో కల్వకుర్తి అసెంబ్లీ స్థానం నుంచి తీవ్ర ఉత్కంఠ నడుమ విజయం సాధించారు. అనంతరం 2018 ఎన్నికల్లో మూడోస్థానంతో సరిపెట్టిన వంశీచంద్‌రెడ్డి పూర్తిగా పార్టీలో యాక్టివ్‌గా మారారు. ఎన్ఎస్‌యూఐ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అధ్యక్షుడిగా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, ఎన్ఎస్‌యూఐ అస్సాం రాష్ట్ర పీఆర్ఓగా, ఉమ్మడి రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కీలక పదవులు చేపట్టారు. ప్రస్తుతం పార్టీ సంస్థాగత సీడబ్ల్యూసీలో చోటు సంపాదించారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన వారిలో గతంలో దివంగత జైపాల్‌రెడ్డి కేంద్ర మంత్రిగా, ప్రస్తుతం వంశీచంద్‌రెడ్డి పార్టీలో ఉన్నత స్థాయిలో ఉండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నేడు తీజ్ ముగింపు ఉత్సవాలు



అచ్చంపేట: అచ్చంపేట మండలం దుబ్బతండాలో ఈనెల 21న సోమవారం తీజ్ ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయలతో వేడుకలు జరుపుకొన్నారు. ప్రధానంగా పెళ్లి కాని గిరిజన యువతులు తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షలు ఉండి మేరామ్మతల్లి,సేవాలాల్ మహారాజ్‌లను స్మరించుకుంటారు. తీజ్ బుట్టల్లో మొలకలకు ప్రతి రోజు ఉదయం , సాయంత్రం నిష్టతో నీరుపోసి వర్షాలు సకాలంలో పడాలని కోరుకుంటారు. చివరి రోజు తీజ్ బుట్టను ఎత్తుకొన్న అమ్మాయిలతోపాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఊరేగింపు నిర్వహిస్తారు. చెరువు దగ్గరకు వెళ్లి సంప్రదాయ పద్ధతులతో పూజలు నిర్వహించి బుట్టలను చెరువులో నిమజ్జనం చేస్తారు.

### ముదిరాజ్ ప్లీనరీని విజయవంతం చేయండి



వనపర్తిటౌన్: హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో ఈ నెల 25న నిర్వహించే ముదిరాజ్ ప్లీనరీకి గ్రామ, మండల, పురపాలికలోని సంఘం ముఖ్యనాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో ప్లీనరీ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ మత్స్యకారులకు దామాషా ప్రకారం అసెంబ్లీ సీట్లు కేటాయించాలని, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్ జిల్లాల్లో రెండు చొప్పున, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక స్థానం కేటాయించాలని డిమాండ్ చేశారు.

### నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో అవకాశం

మహబూబ్‌నగర్ క్రీడలు: నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. ఢిల్లీలో ఆదివారం నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికలు నిర్వహించగా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఖాజాఖాన్, సంయుక్త కార్యదర్శిగా బి.విక్రమాదిత్యరెడ్డి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఖాజాఖాన్ నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆదిత్యరెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఖాజాఖాన్ రెండోసారి నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు.

## కష్టపడితే విజయం మనదే



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొల్లాపూర్: కష్టపడితే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే యు.రాజేష్‌నాయక్ అన్నారు. ఆదివారం కొల్లాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాజేష్‌నాయక్ స్థానిక నాయకులతో సమావేశం అయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజేష్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఒక కుటుంబం చేతిలో బందీ అయ్యిందన్నారు. కేసీఆర్ కుటుంబ కబంద హస్తాల నుంచి తెలంగాణను విముక్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి మంచి రోజులు రాబోతున్నాయని, సుపరిపాలన బీజేపీ ద్వారానే సాధ్యమన్నారు. కొల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సుధాకర్‌రావు కృషి వల్లనే కొల్లాపూర్‌కు జాతీయ రహదారి వచ్చిందన్నారు. సమావేశం అనంతరం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సుధాకర్‌రావు మహిళలకు ఏర్పాటుచేసిన కుట్టు పరిశ్రమను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కేతూరి బుడ్డన్న, శ్రీనివాస్‌యాదవ్, రామన్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రోజారమణి, సాయికృష్ణగౌడ్ తదితరులున్నారు.

**రాష్ట్రంలో రాబోయేది డబుల్ ఇంజిన్ సర్కారే**

అచ్చంపేట రూరల్: దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ హవా కొనసాగుతుందని, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని కర్ణాటక రాష్ట్ర సక్లేశ్‌పూర్ ఎమ్మెల్యే సిమెంట్ మంజు అన్నారు. ఆదివారం అచ్చంపేటలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అచ్చంపేటలో బీజేపీ పుంజుకుందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. వారం రోజుల పాటు నియోజకవర్గంలోనే ఉంటూ అచ్చంపేటలోని బీజేపీ పరిస్థితులను కేంద్ర నాయకత్వానికి నివేదిస్తానని తెలిపారు. అచ్చంపేటకు వచ్చిన ఆయనను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

## విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారిని సన్మానిస్తున్న సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు

కందనూలు: విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించడంలో సత్యసాయి సేవా సంస్థలు ముందుండి పనిచేస్తున్నాయని సాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు గుబ్బ శంకరయ్య అన్నారు. సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో సమితి స్థాయి బాల వికాస్ గురువులకు ఒక రోజు శిక్షణ ఆదివారం జిల్లా కేంద్రంలోని సాయి మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో బాల వికాస్ తరగతులు నిర్వహించాలని, వారాంతపు బాలవికాస్ తరగతులు సత్య సాయి మందిరం, మార్కెట్ యార్డ్, ఉయ్యాలవాడ, ఎండబెట్ల, పట్టణంలోని గ్లోబల్ స్కూల్లో చేపట్టడం జరుగుతుందన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధి, సమితి పరిధిలో ఉన్న భజన మండలి అన్నింటిలో బాలవికాస్ కేంద్రాలను ప్రారంభించడం లక్ష్యంగా గురువులను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాయి మందిర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పవర్ పాయింట్ ద్వారా బాలవికాస్ గ్రూప్–1శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో బాలవికాస్ జిల్లా ఇంచార్జ్ రమేష్, జిల్లా సేవాదళ్ ఇన్చార్జి బిళ్ళకంటి రవికుమార్, మహిళా ఇంచార్జ్ అరుణ, గురువులు సువర్ణ, లలిత పావని ,సుజాత, రాఘవేందర్, సతీష్ , మధు ప్రదీప్,సమితి సేవాదళ్ బాధ్యులు భాస్కర్,రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేనెల 3న పద్మశాలి శంఖారావం

మహబూబ్‌నగర్ రూరల్: పద్మశాలి శంఖారావం సభ వచ్చేనెల 3న నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రావు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో శంఖారావం సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు జరిగే పద్మశాలి రాజకీయ శంఖారావం బహిరంగ సభకు ఇంటికొకరు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పద్మశాలీలు 40 లక్షల మంది ఉన్నారని, కానీ, అసెంబ్లీలో ఒక్కరు కూడా లేరని, ఇది పద్మశాలి జాతికే అవమానకరం అన్నారు. జనాభా ప్రాతిపదికన, దమాషా పద్ధతిలో పద్మశాలీలకు రెండు పార్లమెంట్, ఆరు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, అన్ని మున్సిపాలిటీలు, మండలాల నుంచి పద్మశాలీలు తరలిరావాలని కోరారు. అనంతరం తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా రాజశేఖర్, జిల్లా పద్మశాలి యువజన విభాగం అధ్యక్షుడిగా సత్యనారాయణలను నియమించారు. కార్యక్రమంలో అనంతరాములు, ప్రతాప్, శంకర్, బుచ్చన్న, శ్రీకాంత్, బాలరాజు, వెంకటేష్, నాగరాజు, సత్యనారాయణ, వెంకటేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## లారీ డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండుప్రాణం బలి

### మరో ఇద్దరికి తీవ్రగాయాలు

అచ్చంపేట రూరల్: ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ మొదట ఓ ఆటోను.. ఆ తర్వాత బైక్‌ను ఢీకొట్టడమేగాక లారీని రోడ్డుపైనే నిలిపి పరారవడంతో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసింది. మరో ఇద్దరు వ్యక్తులు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటనలు అచ్చంపేట మండలం చెన్నారం గేటు సమీపంలో ఆదివారం సాయంత్రం, రాత్రి చోటుచేసుకున్నాయి. వివరాలిలా.. ఓ లారీ డిండి నుంచి అచ్చంపేట వైపు వస్తోంది. అయితే, చెన్నారం గేటు సమీపంలోకి రాగానే అచ్చంపేట నుంచి ఉప్పునుంతల మండలం ఆవులోనిబావికి వెళ్తున్న ఓ ఆటోను, ఆ తర్వాత మరో బైకును లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న నీరంజన్‌కు తీవ్రంగా, బైక్ మీద ఉన్న చంటికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ లారీని రోడ్డుపైనే నిలిపి పరారయ్యాడు.

**ఆగి ఉన్న లారీని ఢీకొట్టి యువకుడి దుర్మరణం**

ఇదిలాఉండగా, డిండి నుంచి పదర మండలం వంకేశ్వరానికి బైక్‌పై వెళ్తున్న అభిచంద్రకాంత్ (26), అయ్యప్ప సదరు ఆపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో అభిచంద్రకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయ్యప్పను స్థానికులు అచ్చంపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అయ్యప్ప పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా లారీ డ్రైవర్ అజాగ్రత్తగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను, బైక్‌ను ఢీకొట్టి లారీని రోడ్డుపైనే వదిలి వెళ్లడంతోనే ప్రమాదానికి కారణమయ్యాడని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని అచ్చంపేట పోలీసులు తెలిపారు.



ఘటన స్థలంలో మృతుడు అభిచంద్రకాంత్.. అపస్మారక స్థితిలో అయ్యప్ప

## క్లుప్తంగా

### కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం


చిన్న వాబయ్య (ఫైల్)

మాగనూర్: మండలంలోని వర్కూర్ చెందిన చిన్న వాబయ్య(34) పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వాబయ్యకు వివాహమైన 8ఏళ్లకు భార్య చనిపోయింది. రెండేళ్ల క్రితం ధన్వాడ మండలానికి చెందిన లావణ్యతో రెండో వివాహమైంది. ఇంకా పిల్లలు కాకపోవడంతో రెండు నెలల నుంచి ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. శనివారం కుటుంబ కలహాలు మనస్సులో పెట్టుకుని గ్రామ సమీపంలోని తమ పొలం వద్ద పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ట్రాక్టర్‌లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం చెందాడు. ఆయన అన్నయ్య పెద్ద వాబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### మనస్తాపంతో విద్యార్థిని..


అశ్విని (ఫైల్)

మల్దకల్: ఇంట్లో తరుచూ తల్లిదండ్రులు గొడవలు పడుతుండడంతో మనస్తాపం చెందిన అశ్విని (21) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎల్కూరు చెందిన ర్యాలంపాడు కిష్టన్న, జమ్మేశ్వరి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అశ్విని గద్వాల పట్టణంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. తల్లిదండ్రులు గొడవలు పడుతుండడంతో మనస్తాపం చెందిన అశ్విని పొలానికి పిచికారి చేసే పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

### కాల్వలో పడిన మహిళను కాపాడిన గ్రామస్తులు

మక్తల్: భీమా కాల్వలో పడి కొట్టుకుపోతున్న మహిళను రుద్రసముద్రం గ్రామస్తులు కాపాడిన ఘటన పంచలింగాలలో ఆదివారం చోటుచేసుకుంది. పంచలింగాలకు చెందిన లింగమ్మ భీమా కాల్వ సమీపంలో వస్తున్న సమయంలో కాలు జారి పడింది. వ్యవసాయ పొలాల్లో పనులు చేస్తున్న వారు అక్కడికి చేరుకుని మహిళను బయటకు తీశారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించి ఆమెను చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

జడ్చర్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిధిలో రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గద్వాల నుంచి కాచిగూడకు రైలులో వెళ్తున్న ఖాజ (30) స్థానిక రైల్వేస్టేషన్ దాటిన కొద్దిసేపటికే గౌడ ఫంక్షన్ హాల్ సమీపంలో రైలు నుంచి జారి కిందకు పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిక తరలించారు.

### రైలులో ప్రసవం: తల్లీబిడ్డ క్షేమం



జడ్చర్ల: రైలులో ప్రయాణిస్తున్న గర్భిణికి అకస్మికంగా పురిటి నొప్పులు వచ్చి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి గద్వాలకు ఆదివారం గర్భిణి హర్ష తబసుమ కాన్పు కోసం తుంగభద్ర రైలులో బయలుదేరింది. అయితే జడ్చర్ల సమీపంలోకి వచ్చే సరికి ఆమెకు నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమె వెంట ఉన్న బంధువులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది శివారెడ్డి, తులసీరామ్ జడ్చర్ల రైల్వే స్టేషన్‌కు చేరుకుని అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. అయితే రైల్వే స్టేషన్‌కు చేరుకునే సరికే రైలులో ఆమె ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

### ఆలయంలో చోరీ

పెబ్బేరు రూరల్: శ్రీరామాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మండల పరిధిలోని పాత సూగూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని శ్రీరామాలయానికి పూజారి రోజువారీగా తాళం వేసివెళ్లాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం విరగొట్టి లోపలికి చొరబడి హుండీని బద్దలుగొట్టేందుకు ప్రయత్నించారు. అది రాకపోవడంతో సీతమ్మ విగ్రహం మెడలో తాళి బొట్టును తీసుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎస్‌జీఎఫ్ క్రీడలకు సన్నాహాలు

- త్వరలో జిల్లాలో ప్రారంభం
- అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నీలకు ప్రతిపాదనలు
- అండర్-19 విభాగంలో నాలుగు టోర్నీలకు..


జిల్లా కేంద్రంలో జరిగిన అండర్-14 జాతీయ ఎస్‌జీఎఫ్ వాలీబాల్ టోర్నీ(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: త్వరలో జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడల సందడి నెలకొననుంది. పాఠశాల, కళాశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తారు. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్ 14, అండర్-17, అండర్-19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల స్థాయి నుంచి మొదలుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తారు. అయితే కరోనా మహమ్మారితో మూడేళ్ల తర్వాత ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు కొనసాగనున్నాయి.

**పాఠశాల, కళాశాల స్థాయిలో క్రీడావేదిక**

క్రీడలు పాఠశాల, కళాశాల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఒక క్రీడావేదికగా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో జిల్లాకు చెందిన ఎందరో క్రీడాకారులు స్కూల్ గేమ్స్ ద్వారానే ప్రతిభ చాటి వెలుగులోకి వచ్చారు. వందలాది మంది విద్యార్థులు జాతీయ స్థాయి టోర్నీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. జిల్లాలో ప్రతి ఏడాది రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నీలతో పాటు పలు మార్లు జాతీయ స్థాయి క్రీడా టోర్నీలు నిర్వహించారు. ఐదేళ్లు వరుసగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా టోర్నీలను విజయవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ప్రతి ఏడాది మహబూబ్‌నగర్ ఏదో ఒక జాతీయ స్థాయి క్రీడా టోర్నీని జిల్లాకు కేటాయించడం విశేషం.


జిల్లా కేంద్రంలో జరిగిన అండర్-14 జాతీయ ఎస్‌జీఎఫ్ వాలీబాల్ టోర్నీ(ఫైల్)

**జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ప్రతిపాదనలు**

ఈ ఏడాది జిల్లాలో పలు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాధ్యులకు పలు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల, బాలికలకు క్రికెట్ టోర్నీ, అండర్-14, అండర్-17 బాల, బాలికలకు వాలీబాల్, అండర్-14, అండర్-17 ఫుట్‌బాల్ బాల, బాలికల టోర్నీల కోసం ప్రతిపాదనలు పంపారు. ఈ క్రీడా టోర్నీలను కేటాయిస్తే జిల్లాలో నిర్వహించడానికి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు సిద్ధమవుతున్నారు.

**అండర్-19 విభాగానికి నాలుగు టోర్నీల ప్రతిపాదనలు**

కళాశాల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగానికి ఈ ఏడాది క్రికెట్, బాస్కెట్‌బాల్, తైక్వాండో, హ్యాండ్‌బాల్ టోర్నీలకు రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నీలకు ప్రతిపాదనలు పంపారు. వచ్చే నెలలో అండర్-19 విభాగానికి మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల జిల్లాలను కలిపి ఉమ్మడి జిల్లా స్థాయిలో సెలక్షన్స్ నిర్వహించనున్నారు.

**త్వరలో ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం**



డీఈఓ అధ్యక్షతన జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహిస్తారు. అనంతరం జిల్లాలో మొదటగా మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభించి, జిల్లా, ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తాం. మండల, జిల్లా స్థాయి, ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను పకడ్బందీగా నిర్వహిస్తాం. రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నీల నిర్వహణకు ప్రతిపాదనలు పంపించాం.

– రమేశ్‌బాబు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

**రాష్ట్ర స్థాయి టోర్నీలను నిర్వహిస్తాం..**



ఈ ఏడాది అండర్-19 విభాగానికి నాలుగు రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నీలకు ప్రతిపాదనలు పంపించాం. ఉమ్మడి జిల్లాకు ఏ టోర్నీలు కేటాయిస్తారో వాటిని విజయవంతంగా నిర్వహిస్తాం. ఉమ్మడి జిల్లా స్థాయి సెలక్షన్స్‌ను పకడ్బందీగా నిర్వహిస్తాం.

– పాపిరెడ్డి, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

**మండల స్థాయి నుంచి ప్రారంభం..**

ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను మండల స్థాయి నుంచి ప్రారంభించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మొదట మండల స్థాయి క్రీడలను ఈ నెల చివరి వరకు నిర్వహించి అనంతరం సెప్టెంబర్ రెండు, మూడు వారాల్లో జిల్లా స్థాయి, చివరి వారంలో ఉమ్మడి జిల్లా (జోనల్) స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణ కోసం వారం రోజుల్లో డీఈఓ అధ్యక్షతన జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ప్రారంభిస్తారు.

### ఆర్మీ ఉద్యోగం సాధించిన 'పేట' యువతి


అంజలి

నారాయణపేట రూరల్: జిల్లాలోనే తొలి సారిగా ఆర్మీకి ఓ యువతి ఎంపికైంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని బహార్ పేటకు చెందిన మల్లమ్మ, బాలప్ప దంపతుల మూడవ కుమార్తె అంజలి. చిన్నతనం నుంచి దేశ సేవలో భాగస్వామి కావాలని కలలుకంది. అందుకు అనుగుణంగా తన విద్యాభ్యాసం కొనసాగిస్తూనే లక్ష్యంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొంది బీఎస్ఎఫ్‌లో స్థానం సంపాదించుకుంది. అనుకున్న లక్ష్యం నెరవేరడంతో ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేయడంతో పాటు తన విజయానికి తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారని, వారి సహకారంతో కల నిజం చేసుకున్నానని చెప్పుకొచ్చింది. జిల్లా నుంచి ఆర్మీలోకి వెళ్తున్న తొలి మహిళ కావడంతో పట్టణవాసులు అభినందనలు తెలియచేస్తున్నారు.

### కుళ్లిన కోడిగుడ్ల పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: కుళ్లిన కోడిగుడ్లను తరలిస్తున్న రెండు వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ అశోక్‌బాబు ఆదివారం తెలిపారు. ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం చెందిన ఉల్వల శివ, మానవపాడు మండలంలోని బోరవెల్లికి చెందిన మేకల నరేంద్ర తమ రెండు బొలెరో వాహనాలలో హైదరాబాద్ నుంచి ఎర్రవల్లి పరిసర ప్రాంతాలలోని చేపల చెరువులకు అక్రమంగా కుళ్లిపోయిన గుడ్లను తరలిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ఎర్రవల్లి కూడలిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది రెండు వాహనాలను తనిఖీ చేశారు. అందులో కుళ్లిన కోడిగుడ్లు ఉండటంతో అదుపులోకి తీసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# ఉద్యమంలో మాదిగలదే కీలకపాత్ర

- కేబినెట్‌లో ఒక్క మాదిగ మంత్రి లేకపోవటం విడ్డూరం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నవాబుపేట: తెలంగాణ ఏర్పాటుకు ఆది నుంచి కేసీఆర్‌తో పాటు సమానంగా ఉద్యమం చేసింది మాదిగజాతేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ ఒక్క మాదిగను కూడా కేబినెట్‌లో మంత్రి పదవి ఇవ్వకపోవటం విడ్డూరమన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని హన్మసానిపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మాదిగలకు సముచిత స్థానం కల్పించని పాలకులపై తిరుగుబాటు చేయాలన్నారు. ఉద్యమంకు అవసరమొచ్చిన మాదిగలు మంత్రి పదవులకు పనికిరారా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ దొరలపాలనపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ విశ్వరూప సభకు లక్షలాదిగా తరలి వచ్చి సత్తా చాటాలన్నారు.

**అంబేడ్కర్‌తో పాటు జగ్జీవన్‌రాం సేవలు గుర్తించాలి**

అంబేడ్కర్‌తో పాటు నాటి అణగారిన జాతుల హక్కులకు చట్టబద్ధత కల్పించే విషయంలో కీలంగా ఉన్న బాబు జగ్జీవన్‌రాం సేవలు సైతం ప్రతి వ్యక్తి గుర్తించాలన్నారు. నాటి స్వాతంత్ర్య పోరాటంతో గాంధీజీతో పాటు అతిచిన్న వయస్సులో సంగ్రామంలో పాల్గొన్న జగ్జీవన్‌రాం 53ఏళ్లు జాతి కోసం చేసిన సేవలు మరువరాదన్నారు. హన్మసానిపల్లి ఉపసర్పంచ్ భీమయ్య, శాంతయ్య, బాలయ్య, నర్సింహులు, వెంకటయ్య, రాంచంద్రయ్య, శంకర్, కృష్ణయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులను సంక్షోభంలో నెట్టొద్దు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ నుంచి వెలువడే కాలుష్యంతో రైతులను సంక్షోభంలోకి నెట్టొద్దని తెలంగాణ విద్యా వంతుల వేదిక నాయకుడు బైరెడ్డి సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కంపెనీ ఎదురుగా చేట్టిన రిలే దీక్షలో ఆయన మాట్లాడుతూ.. కంపెనీకి వ్యతిరేకంగా రైతులు రెండేళ్ల నుంచి పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు నోరు విప్పడం లేదన్నారు. ఇథనాల్ కంపెనీ వల్ల భవిష్యత్‌లో కెమికల్ వెలువడి ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. వెంటనే కంపెనీ రద్దు చేసేందుకు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రైతులకు మద్దతుగా పోరాటం చేయాలన్నారు. లేకుంటే రాబోవు ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యాయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవచారి, లక్ష్మయ్య, నాగభూషణ, చంద్రశేఖర్, శివారెడ్డి, శ్రీదేవి, మురళీధర్‌గుప్తా పాల్గొన్నారు.



### డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు

జడ్చర్ల: మండలంలోని చిట్టెంబోయిన్‌పల్లి శివారులో జాతీయరహదారిపై ఆదివారం ట్రావెల్ బస్సు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు చిట్టెంబోయిన్‌పల్లి సమీపంలోకి వచ్చే సరికి వన్‌వే కొనసాగుతున్న పరిస్థితిలో పక్కనే ఉన్న డివైడర్‌ను బస్సు ఢీకొంది. అందులో 15 మంది ప్రయాణికులు ఉండగా అలంపూర్‌కు చెందిన ప్రయాణికుడు దయానందసింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వైద్య చికిత్స కోసం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# నసరుల్లాబాద్‌లో ఉద్రిక్తత


పాదయాత్ర చేస్తున్న నాయకులపై దాడికి పాల్పడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

- అనిరుధ్‌రెడ్డి పాదయాత్రపై బీఆర్ఎస్ నాయకుల దాడి
- గుంపులను చెదరగొట్టిన పోలీసులు

జడ్చర్ల: నియోజకవర్గంలో టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి చేపట్టిన ప్రజాహిత పాదయాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని నసరుల్లాబాద్‌కు చేరుకోగా, బీఆర్ఎస్ చెందిన సర్పంచ్ ప్రణీల్‌చందర్‌తో పాటు కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. అనిరుధ్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఆదివారం మిడ్జిల్ మండలంలో ముగించుకుని జడ్చర్ల మండలంలోకి అడుగు పెట్టింది. గ్రామంలో పర్యటించిన అనంతరం కార్నర్ మీటింగ్‌లో అనిరుధ్‌రెడ్డి ప్రసంగం కొనసాగింది. నసరుల్లాబాద్‌లో దళితులకు చెందిన 19 గుంటల శ్మశానస్థలాన్ని బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ ఆక్రమించి అమ్మేశారని అనిరుధ్‌రెడ్డి పరోక్షంగా ఆరోపించారు. అంతేగాక పట్టణంలోని హౌసింగ్ బోర్డు సమీపంలో సైతం ఇదే దున్నపోతు ఆక్రమణలకు పాల్పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఉన్న కాలనీలలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు కూడా చేపట్టలేదన్నారు. కార్నర్ మీటింగ్ ముగించుకుని వెళ్తున్న సందర్భంలో సర్పంచ్ తన అనుచరగణంతో తమపై దాడికి పాల్పడ్డారని అనిరుధ్‌రెడ్డి తెలిపారు. కర్రలతో తనపై దాడి చేసేందుకు ప్రయత్నించగా అడ్డుపడిన మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు అనిత, మరో నాయకుడు కాశన్న అడ్డుకోగా, కర్రలు విరిగిపోయాయన్నారు. వారు అడ్డుపడకపోతే ఆ కర్రల వేటు తనపై పడి ఉండేదన్నారు. దాడిలో వారిద్దరికి గాయాలయ్యాయని తెలిపారు. ప్రతి గ్రామంలో రౌడీ మూకలను స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పోగేశారని అన్నారు. తమపై దాడికి పాల్పడిన వారిపై డీఎస్పీ, జడ్చర్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

**మూకుమ్మడి దాడికి యత్నించారు: ప్రణీల్ చందర్**

తన ఇంటిపైకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేసేందుకు ప్రయత్నించారని, పోలీసులు అడ్డుపడడంతో వెనక్కి తగ్గారని సర్పంచ్ ప్రణీల్ చందర్ తెలిపారు. పాదయాత్ర సందర్భంలో తాను గ్రామంలోనే లేనని పాదయాత్ర అనంతరం వారు ఊరు విడిచి వెళ్తున్న సమయంలో అప్పుడే ఊర్లోకి వచ్చిన తాను.. పాదయాత్రలో ఉన్న తనకు తెలిసినా వారితో తనపై ఆరోపణలు చేయడం ఏమిటని సైగలు చేశానన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు జెండా కర్రలతో తనపైకి దూసుకురావడంతో తమ కార్యకర్తలు అడ్డుకున్నారని అన్నారు. కాగా సమాచారం అందుకున్న పోలీసులు గుంపులను చెదరగొట్టి, ఇరు వర్గాలను శాంతపరిచి సముదాయించారు.

# పంటల ముఖ్య పోషకం నత్రజని


నత్రజని లోపం ఉన్న వరి పైరు

**పాడి-పంట**

**అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్**

అలంపూర్: మనిషికి ఆహారం అవసరం ఉన్నట్లే మొక్కలకు కూడా ఆహారం కావాలి. మొక్కలు ఆహారాన్ని ధాతువుల రూపంలో తీసుకుంటాయి. వీటిని పోషకాలు కూడా పిలుస్తారని ఏడీఏ సక్రియ నాయక్ తెలిపారు. మొక్క ఆరోగ్యంగా పెరగడానికి, ప్రత్యుత్పత్తికి 18 పోషకాలు అవసరమని రైతులకు వివరించారు.

**గాలి నుంచి మొక్కలకు సహజంగా లభించే పోషకాలు**

కార్బన్, ఆక్సిజన్, హైడ్రోజన్ ఈ మూడింటి గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిన పని గాని, అందించాల్సిన అవరం లేదు.

**ముఖ్య పోషకాలు**

నత్రజని, భాస్వరం, పొటాష్

**ఉప పోషకాలు**

కాల్షియం, మెగ్నీషియం, గంధకం

**సూక్ష్మ పోషకాలు**

జింకు, రాగి, ఇనుము, మాంగనీస్, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్, సోడియం, కోబాల్టు.

మొక్కల జీవన ప్రక్రియలో ప్రతి పోషకం ప్రత్యేకమైన పని నిర్వర్తిస్తుంది. అది లోపించినప్పుడు ఆ పని కుంటుపడుతుంది. దీని ప్రభావం వలన దిగుబడి తగ్గుతుంది. ఒక పోషకం చేసే పని మరోక పోషకం చేయలేదు

**నత్రజని పాత్ర**

ఇది మొక్కకు కావాల్సిన ముఖ్య పోషకాలలో మొదటిది. పైరుకు దీని అవసరం మొదటి నుంచి చివరి వరకు ఉంటుంది. పత్ర హరితం జీవ పదార్థం కేంద్రక ఆమ్లాలలో నత్రజని ఒక భాగం. నత్రజనిని మొక్కలు అమ్మోనియం నైట్రేట్ రూపాలలో తీసుకుంటాయి. నత్రజని ప్రభావం పైరు పెరుగుదల మీద దుబ్బు చేయడంలోను కొమ్మలు తొడగడంలోను ఉంటుంది. పైరు మీద దీని ప్రభావం స్పష్టంగా త్వరితంగా కనిపిస్తుంది. నత్రజని వాడకం వలన మాంసకృతుల శాతం పెరుగుతుంది. మొక్క నిర్మాణానికి మూలమైన జీవ కణమైతే జీవ కణాల నిర్మాణానికి నత్రజని మూలధారం.

**నత్రజని అధికంగా వాడితే**

ముఖ్యమైన నత్రజనిని అవసరం మేరకే వాడాలి. అధికంగా వేస్తే అనర్థాలకు దారి తీస్తుంది. ఎక్కువగా వాడితే పైర్లు విపరీతంగా పెరిగి పడిపోవడం, పూతకు ఆలస్యంగా రావడం, పంట కాలం పొడిగించడం, తాలు గింజల శాతం పెరగడం, చీడ పీడలకు సులభంగా గురికావడం దిగుబడి తగ్గిపోతుంది.

**నత్రజని లోపిస్తే..**

పెరుగుదల నెమ్మదిగా, మొక్కలు పొట్టిగా ఉండిపోవడం, ఆకులు వాలిపోయి పసుపు రంగుకు మారడం, ఫల సాయంతో మాంసకృత్తుల శాతం తగ్గిపోవడం జరుగుతుంది. లోపం తీవ్రంగా ఉన్నప్పుడు ఆకుల మొనల నుంచి మధ్య వరకు క్రమంగా మాడిపోవడం ముదురు ఆకులు ముందుగానే పసుపు రంగుకు మారి ఎండిపోయి రాలిపోతాయి.

**నత్రజని అందించే ఎరువులు**

నత్రజని అందించడానికి యూరియా, అమ్మోనియం సల్ఫేట్, కాల్షియం, అమ్మోనియం క్లోరైడ్ ఎరువులు వాడాలి. నత్రజని సులభంగా కొట్టుకపోయే స్వభావం ఉంటుంది. ఈ ఎరువుల వినియోగ ఫలితం 30–45 శాతం మాత్రమే. ఈ ఎరువులు వేసే విధానంలో జాగ్రత్తలు పాటించాలి.

# జూరాలకు పూర్తిగా తగ్గిన ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిపోయినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రానికి కేవలం వెయ్యి క్యూసెక్కుల వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నాలుగు రోజుల నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టింది. మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 112, భీమా లిఫ్టు -1 ద్వారా 650, కోయిల్ సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, కుడి కాల్వకు 738, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.261 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం నుంచి ఆదివారం 1,838 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 870 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్-2 ద్వారా 848 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

**శ్రీశైలంలో 859.3 అడుగుల నీటిమట్టం**

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 859.3 అడుగుల నీటి మట్టం, 103.8 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 9వేలు, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,857, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.682 మి.యూనిట్లు ఉత్పత్తి చేసి 1,169 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 200 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

## క్లుప్తంగా

### డిగ్రీ ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్

బిజినేపల్లి: మండలంలోని పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రవేశాల కోసం ఆగస్టు 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విద్యారాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతుందని, కళాశాలలో బీఎస్సీ, బీజెడ్‌సీ-సీఎస్, బీఎస్సీ ఎంపీసీ, బీజెడ్సీ, బీఏ-హెచ్‌ఈపీ, ఈపీపీ, హెచ్‌పీబీఎల్ (తెలుగు) కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

### బీఎస్పీ అచ్చంపేట అసెంబ్లీ అధ్యక్షుడిగా మల్లయ్య



అచ్చంపేట రూరల్: బహుజన సమాజ్ పార్టీ అచ్చంపేట అసెంబ్లీ అధ్యక్షుడిగా మల్లయ్యను రాష్ట్ర, జిల్లా నాయకులు, అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగార్జున సమక్షంలో నియమించారు. ఆదివారం పట్టణంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగార్జునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### పరామర్శ

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఇటిక్యాల చెన్నయ్య(45)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ సీర్ల బాలస్వామి, నాయకులు రిజ్వాన్, అంజి, శ్రీనివాసులు ఉన్నారు.

### దామోదర రాజనర్సింహ నియామకంపై హర్షం

అమ్రాబాద్: మాజీ ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత దామోదర రాజనర్సింహకు సీడబ్ల్యూసీలో చోటు కల్పించడంపై అమ్రాబాద్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజ్‌గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో మాదిగలకు మొదటి నుంచి సముచిత స్థానం కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

### ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో హరితహారం



తాడూరు: మండలంలోని ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో ఆదివారం బలాన్‌పల్లి సూర్యదేవ ఆలయ ఆవరణను శుభ్రం చేసి హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌అండ్‌టీ అధికారులు సుధాకర్, వెంకటేష్ కంపెనీ సిబ్బందితో మొక్కలు నాటించారు. సర్పంచ్ అశోక్, సామాజిక కార్యకర్త వెంకటస్వామి ఉన్నారు.

### అన్నదానం



కల్వకుర్తిరూరల్: ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంతో పుణ్యకార్యమని లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పశువుల సంతలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతులకు అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చేపట్టిన మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా క్లబ్ మాజీ గవర్నర్ రమేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని రైతులకు అన్నదానం చేశారు. క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి గోవిందు శ్రీనివాస్, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ కిషన్, వెంకటేశ్, శ్రీనివాస్, ప్రవీణ్, విజయ్, రఘు తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

### టెంకాయ విక్రయాల వేలం

వంగూర్: వచ్చే నెల 4వ తేదీ నుంచి గెల్వాలాంబ మాత దేవాలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. దీంతో పలు సామగ్రిని విక్రయించేందుకు ఆదివారం దేవాలయంలో వేలం పాట నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ వెంకటస్వామి తెలిపారు. టికెట్లకు సంబంధించిన వేలాన్ని గెల్వాలాంబ యూత్ సభ్యులు రూ.1,31,000లకు దక్కించుకున్నారు. కొబ్బరికాయ విక్రయాలకు బాలయ్య రూ.45,000లకు వేలం పాట పాడారు. అదేవిధంగా హుండీ లెక్కించగా రూ.1,00,220 ల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

### వంతెన నిర్మాణాలు చేపట్టాలి

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని వెంకటాపూర్, తర్నికల్ గ్రామాలకు వెళ్లే కల్వకుర్తి కాల్వలపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

- వ్యవసాయ పరికరాలు సబ్సిడీకి మంగళం
- పంట దిగుబడి తగ్గుముఖం



టార్పాలిన్ కవర్లను అందజేస్తున్న ఏఈఓ (ఫైల్)



మండల వ్యవసాయశాఖ కార్యాలయం

తాడూరు: గతంలో పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ అందజేసేది. దీంతో పంటలు సాగు చేసేందుకు రైతులు ఎంతో ఆసక్తి కనబరిచేవారు. సబ్సిడీపై పరికరాలపై పంపిణీ చేయడంతో రైతులు వాటిని కొనుగోలు చేసి సాగు చేసేవారు. అనుకున్న దానికన్న ఎక్కువ ఎకరాలలో సాగు చేస్తూ దిగుబడి సాధించేవారు. ప్రస్తుతం సబ్సిడీపై పరికరాలు అందించకపోవడంతో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. సబ్సిడీపై యంత్రాలు అందక రైతన్నలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సాగులో సాంకేతికత, యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఆశించిన దిగుబడులు సాధించడం లేదు. గత 6,7 సంవత్సరాల నుంచి పరికరాలు అందకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

**నిలిచిపోతున్న పథకాలు**

వ్యవసాయ శాఖ ద్వార రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. 2006–07 సంవత్సరం నుంచే వ్యవసాయ పథకాలకు కోత విధిస్తున్నారు. రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్ల పంపిణీ 2014 నుంచి నిలిపివేశారు. యాంత్రీకరణ, రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండడం, మరో వైపు మంజూరయ్యే యూనిట్ కూడా నామమాత్రంగా ఉంటున్నాయి. రైతులకు నిత్యావసరంగా మారిన టార్పాలిన్ కవర్లు కూడా చాలా వరకు తగ్గించారు. కల్టివేటర్, రోటోవేటర్‌ల జాడే లేదు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను యదావిధిగా కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

**మండలంలో ఇలా..**

మండలంలో 24 గ్రామ పంచాయతీలలో 16283 మంది రైతులు ఉండగా దాదాపు 43816 ఎకరాలకు పైగా సాగుభూమి ఉంది. వ్యవసాయ శాఖ ద్వారా గతంలో రైతులకు సబ్సిడీ పథకాలు ఉండేవి. డ్రిప్ పరికరాలు, కేజీవీల్స్, థైవాన్ స్ప్రేలు, నాగళ్లు, మినీ ట్రాక్టర్లు, వివిధ రకాల పనిముట్లను ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించేది. కాగా గత 8 సంవత్సరాల నుంచి సబ్సిడీ ఊసే ఎత్తడం లేదు.

**మార్కెట్‌లో అధిక ధరలు**



ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు ఇవ్వడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయలేకపోతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందజేయాలి.

– యాదయ్య, రైతు, అంతారం

**దరఖాస్తులు తీసుకోవడం లేదు**

ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు నిలిపివేయడంతో రైతుల నుంచి దరఖాస్తులను తీసుకోవడం లేదు. గతంలో ఎస్ఎస్‌పీ పథకం ద్వార 50 శాతం సబ్సిడీపై, ఆర్‌కేవీవై, ఎస్ఎస్ఎస్ఎం కేంద్ర ప్రభుత్వం అందజేసే వివిధ స్కీములను బట్టి 50 నుంచి 95 శాతం సబ్సిడీపై అందజేసేది. ప్రస్తుతం సబ్సిడీ రావడం లేదు.

–సాయిరమేశ్ కుమార్, ఏఓ

# మరమ్మతు చేయాలి



మాట్లాడుతున్న విజయ్

తాడూరు: మండలంలోని తుమ్మలసూగూరు నుంచి వెళ్తున్న ప్రధాన కేఎల్ఐ డీ26 కాల్వకు మరమ్మతు చేయాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయ్ అన్నారు. ఆదివారం బీఎంపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని సాగునీటి కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోయిందన్నారు. దీంతో పంటపొలాలకు నీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. మండలంలోని చర్ల ఇటిక్యాల, తాడూరు, ఇంద్రకల్, గుంతకోడూరు, మేడిపూర్ గ్రామాల రైతుల పంట పొలాలు, వరినాట్లు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కాల్వలను పరిశీలించి మరమ్మతు చేయించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎంపీ నాయకులు రాందాస్, రైతులు కృష్ణయ్య, బద్రీనాథ్, రాములు, శంకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

పెంట్లవెల్లి: ఐక్య పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధించవచ్చని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వర్

కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



పెద్దకొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. నాగం శశిధర్ రెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రోగులు పండ్లు పంపిణీ చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి అర్థం రవి, మున్సిపల్ అధ్యక్షుడు తిమాజిపేట్ పాండు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ రెడ్డి, రాహుల్, ఆంజనేయులు, సుదర్శన్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాలిక్, రామకృష్ణ, చంద్రశేఖర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు హాజరయ్యారు. శ్రీవాణి విద్యానిలయంలో పార్టీ సీనియర్ నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. చిన్నారులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. రాముయాదవ్, పరశురామ్‌నాయుడు, కాంతారావు, హన్మంతునాయక్, రహీంపాషా, ఎక్బాల్, కృష్ణమనాయుడు, రమేష్‌ముదిరాజ్ తదితరులున్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దండు నర్సింహ, జంగయ్య, కృష్ణయ్య, శంకర్, సర్పంచ్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యులు చందర్, శుక్య, మణిపాల్, కృష్ణ, చందులాల్ ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్: పట్టణంలోని స్వామి రామానంద తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తునట్లు వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు భీమయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, డాటా ఎంట్రీ, వివిధ కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

### రూ.50 వేల విరాళం




చారకొండ: మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయ అభివృద్ధికి నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ ఆదివారం రూ.50వేలు విరాళంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ నెల 28న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని సభ్యులు ఆయనను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అఖిలేష్, అనిల్, శ్రీను, రాములు, శివ, యాదగిరి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### వైద్య శిబిరం ఏర్పాటు



కొల్లాపూర్: పట్టణంలోని దివంగత మాజీ సర్పంచ్ గౌతమ్‌గౌడ్ జ్ఞాపకార్థం సోదరుడు డాక్టర్ రాజేష్‌గౌడ్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం గౌతమ్‌గౌడ్ నివాసంలో కిడ్నీ పరీక్షలతో పాటు, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని సంబంధిత ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కౌన్సిలర్ శ్రీదేవి గౌతమ్‌గౌడ్ ఉన్నారు.

### గడప గడపకు కాంగ్రెస్



కొల్లాపూర్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని అమరగిరిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఉన్న మత్స్యకారుల జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### తగ్గిన టమాట ధర

కల్వకుర్తిరూరల్: కొన్ని రోజుల నుంచి టమాట ధర ఆకాశాన్నంటింది. దీంతో సామాన్యులు టమాటాలను కొనుగోలుకు వెనకడుగు వేశారు. ప్రస్తుతం టమాట ధర దిగిరావడంతో సామాన్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కల్వకుర్తి మార్కెట్‌లో టమాట ధర కేజీ రూ.40లకు పలికింది. వారం రోజుల కిందట టమాట ధర రూ.100కు చేరింది. ప్రస్తుతం తగ్గటంతో ప్రజలు, వినియోగదారులు టమాట కొనుగోళ్లు జోరుగా సాగాయి.

## మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష సాయం



బిజినేపల్లిలో నగదు అందజేస్తున్న స్నేహితులు

బిజినేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదోతరగతి చదివిన శ్రీను ఇటీవల మృతిచెందాడు. దీంతో తోటి మిత్రులు ఒకరికొకరు డబ్బులను పోగు చేసుకొని మొత్తం రూ.లక్ష ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఆదివారం పాఠశాలలో అతని భార్యకు నగదును ఇచ్చారు.

తాడూరు: మండలంలోని చర్లతిరుమలాపురంలో కావలి రాములు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ యువ నాయకుడు డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, శాంతయ్య, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

### వాల్ పోస్టర్ ఆవిష్కరణ




నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 25న నిర్వహించనున్న ముదిరాజ్ ప్లీనరీకి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సందు యాదగిరి విడుదల చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులకు రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో అధికసీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, తెనుగోల్ల జిల్లా భవన సాధన కమిటీ కన్వీనర్ పెబ్బేటి మల్లికార్జున్, మండలాల సొసైటీ అధ్యక్షుడు తుమ్మల అల్లోజిన్, సహదేవుడు, బాలస్వామి, మహేష్, నారయ్య, నిరంజన్, నాయకులు చింతకాయల మహేష్, బంగారయ్య, కురుమయ్య, వెంకటయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

### మాదిగ జాగృతి జిల్లా కమిటీ ఎన్నిక



నాగర్‌కర్నూల్‌రూరల్: మాదిగ జాగృతి సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బోనాసి విష్ణు, సెంటర్ కమిటీ మెంబర్ రాధాకృష్ణ, కో కన్వీనర్‌లుగా కొంగరి జానయ్య, గుడిపల్లి నిరంజన్, రామచందర్, సభ్యులుగా మహేష్, విజయ్, దశరథ్, రాధాకృష్ణలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సాయి, సురేష్, బాలకృష్ణ, రమేష్, హరిబాబు, భీంరావు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి పెద్ద దర్గా ఉర్సు



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో పెద్దదర్గా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని దర్గా పీఠాధిపతి సయ్యద్‌ఖాన్ ఖురానోద్దీన్ షాఖాద్రి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకుమదనపు గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి దర్గా దగ్గరకు దండోత్సవాన్ని తీసుకురావడం ఆనవాయితీ. మంగళవారం ప్రత్యేకంగా ఫాతేహా ప్రార్థనలు ఉంటాయని వివరించారు.

### శిథిలావస్థకు చేరిన ట్యాంక్



పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్లలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. పాఠశాల ఆవరణలో 40 ఏండ్ల కిందట నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఆర్‌డబ్ల్యూసీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని శిథిలావస్థకు చేరిన నీటిట్యాంక్‌కు కూల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నేటి కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి

కొల్లాపూర్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో కలెక్టరేట్ చేపట్టినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు నిర్మించాలన్నారు. కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు తరలిరావాలన్నారు. సమావేశంలో నాయకులు రామకృష్ణ, గోవర్ధన్, సత్యనారాయణ, ప్రవీణ్, శ్రీకాంత్, శివ తదితరులున్నారు.



మాట్లాడుతున్న తారాసింగ్

## ప్రారంభానికి సిద్ధంగా పల్లె దవాఖాన

వెల్దండ: గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పల్లె దవాఖానాలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని కొట్రలో చేపట్టిన పల్లె దవాఖాన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దవాఖాన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షల ప్రత్యేక నిధులను మంజూరు చేసింది. మండలంలోని ఆయా గ్రామాలకు పల్లె దవాఖానలు మంజూరు చేసిన మొట్టమొదటగా కొట్రలో పూర్తిచేసుకోవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో పల్లె దవాఖానాను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు.



కొట్రలో పల్లె దవాఖాన భవనం


ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

## చెట్టుకొమ్మను తప్పించబోయి..
# లోయలోకి బస్సు!

- పాడేరు ఘాట్ రోడ్డులో విషాదం.. ఇద్దరి మృతి
- 28 మందికి గాయాలు..

**సాక్షి, పాడేరు/పాడేరు రూరల్/సాక్షి, అమరావతి, నెట్‌వర్క్:** విశాఖ నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం 34 మంది ప్రయాణికులతో బస్సు వెళుతోంది. పాడేరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఘాట్‌లోని వ్యూపాయింట్ వద్ద మలుపులో రోడ్డు పక్కన చెట్టు కొమ్మలను తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొట్టి వందడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం సూర్రెడ్డిపాలెంకు చెందిన నరవ నారాయణమ్మ(50), అల్లూరి జిల్లా పాడేరు మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన గిరిజనుడు సీసా కొండన్న(55) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అక్కడకు చేరుకున్నారు. ఆర్టీసీ, పోలీస్ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి పరామర్శించారు. అత్యవసర వైద్యం అవసరమైతే విశాఖ కేజీహెచ్ లేదా కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని, క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్య సాయం అందించాలని స్పష్టం చేశారు. పాడేరు ఘాట్‌లో ప్రమాదాలు నివారించేందుకు రవాణ శాఖ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు.

# ‘ఘోస్ట్’ చందా.. మార్గదర్శి దందా!

▶ మొదటి పేజీ తరువాయి

ఏ చిట్ ఫండ్స్ సంస్థలు, ప్రైవేటు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు చేయని రీతిలో వినూత్న రీతిలో మార్గదర్శి సాగిస్తున్న ఆర్థిక అక్రమాలకు ఇది తాజా నిదర్శనం.

### ఇలా ఎందుకు చేశారంటే..

ఇక్కడ మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇలా ఎలా చేసిందనే సందేహం రావడం సహజం. ఎలా అంటే సుబ్రహ్మణ్యం ఆధార్ కార్డును తమ ఏజంట్ల ద్వారా సేకరించి ఆయనకు తెలియకుండానే చిట్టీ గ్రూపులో చందాదారునిగా చేర్చింది. ఇలాంటి వారిని ‘ఘోస్ట్ చందాదారులు’ అని వ్యవహరిస్తారు. అంటే చందాదారులు లేకుండానే వారి పేరిట చిట్టీ గ్రూపుల్లో సభ్యత్వం కొనసాగిస్తారు. అయితే తాను చందాదారునిగా ఉన్నానని సుబ్రహ్మణ్యానికి తెలియదు కాబట్టి ఆయన చందా చెల్లించరు. ఆయన్ని ఎవరూ అడగరు కూడా. దాంతో అసలు విషయం బయటకు వచ్చే అవకాశమే లేదు. ఆయన పేరిట ఉన్న చిట్టీకి ప్రతి నెలా మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం చందా చెల్లించకపోయినా, చెల్లించినట్టుగా రికార్డుల్లో నమోదు చేస్తుంది. ప్రతి నెల చందాదారునికి వచ్చే డివిడెండ్‌ను మాత్రం సుబ్రహ్మణ్యం పేరిట తానే తీసుకుంటుంది. ఒక నెల సుబ్రహ్మణ్యం పేరిట చిట్టీ పాట పాడతారు. ఆ చిట్టీ పాట మొత్తం (ప్రైజ్‌మనీ) మార్గదర్శి యాజమాన్యం తమ సొంత ఖాతాలో వేసుకుంటుంది. అంటే రూపాయి చందా చెల్లించకుండానే.. ప్రతి నెల డివిడెండ్ మొత్తం తీసుకోవడంతోపాటు చిట్టీ పాట పేరిట ప్రైజ్ మనీ కూడా కొల్లగొడుతోంది.

### ఇలా వెలుగు చూసింది..

మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సోదాల్లో భాగంగా సందేహం కలిగిన చందాదారులను స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు సంప్రదిస్తున్నారు. ఆ విధంగా సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యం చీరాలలో చిట్టీ గ్రూపులో సభ్యుడిగా ఉండటం ఏంటనే సందేహం వచ్చి అధికారులు సంప్రదించడంతో అసలు వ్యవహారం బట్టబయలైంది. మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 37 బ్రాంచీల పరిధిలో ఇలాంటి ఘోస్ట్ చందాదారులు భారీగా ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఘోస్ట్ చందాదారుల దందాతోపాటు చందాదారులను దురుద్దేశంతో అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారిని ఆర్థికంగా ఇక్కట్ల పాటు చేస్తోందని కూడా ఈ సోదాల్లో వెల్లడైంది. సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఘోస్ట్ చందాదారులు, చందాదారులకు తెలియకుండానే వారిని ష్యూరిటీగా చూపించడం తదితర మోసాలకు పాల్పడిన ఫిర్యాదులతో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.




### ఘోస్ట్ చందాదారులతో భారీగా అక్రమాలు

వ్యక్తులకు తెలియకుండానే వారి ఆధార్ నంబర్లు సేకరించి, చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చూపిస్తున్నారు. ఆ విధంగా ఘోస్ట్ చందాదారుల పేరిట డివిడెండ్లతోపాటు చిట్టీ మొత్తాన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ ఖాతాల్లో జమ చేసుకుంటూ మోసానికి పాల్పడుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కూడా. ఎందుకంటే ఇతర చందాదారుల ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధంగా అంటే వారికి తక్కువ డివిడెండ్ వచ్చేలా చేస్తున్నారు. మరోవైపు ఘోస్ట్ చందాదారునికి ఎక్కువ వేలంపాట మొత్తం (ప్రైజ్‌మనీ) వచ్చేట్టుగా వేలం నిర్వహిస్తున్నారు.

### వందకుపైగా ఫిర్యాదులు

**చందాదారుల నుంచి ఫిర్యాదులు లేకుండానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలను స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఖండించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పాల్పడుతున్న మోసాలపై పెద్ద సంఖ్యలో చందాదారులు పోలీసులు, సీఐడీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. మూడు రోజుల్లోనే దాదాపు వంద మందికిపైగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. కాగా, చందాదారులు పూర్తి వివరాలతో ఫిర్యాదులు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్ 9493174065 కేటాయించింది.**

### అప్పుల ఊబిలోకి చందాదారులు

చిట్టీ గ్రూపు ప్రారంభంలోనే చందాదారుల నుంచి సంతకాలు తీసుకుని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఏకంగా చందాదారుల ఆస్తులను తమ పేరిట రాయించుకోవడం మార్గదర్శి చిట్‌ఫండ్స్ దారుణాలకు నిదర్శనం. ముందుగా తీసుకున్న సంతకాలను దుర్వినియోగం చేస్తూ ఓ చందాదారునికి కనీసం సమాచారం ఇవ్వకుండానే ఆయన్ను మరో చందాదారునికి ష్యూరిటీగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. దాంతో చిట్టీ పాట పాడిన చందాదారుడు వాయిదాలు చెల్లించ లేదు కాబట్టి, ష్యూరిటీగా పేర్కొన్న చందాదారుడు చెల్లించాలని రికార్డుల్లో చూపిస్తున్నారు. ఓ చిట్టీ పాట పాడిన చందాదారు ప్రైజ్‌మనీ తీసుకుని రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత మిగిలిన వాయిదాలు చెల్లించకపోతే.. ఆ చిట్టీ పాటను రద్దు చేసి సంబంధిత నెలకు కొత్తగా చిట్టీ పాట నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ దీన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ పట్టించుకోవడం లేదు. చిట్టీ వాయిదాలు చెల్లించలేని చందాదారులతో మాట్లాడి వారిని మరో చిట్టీ గ్రూపులో సభ్యులుగా చేరుస్తోంది. ఆ కొత్త గ్రూపులో డివిడెండ్‌తో పాత గ్రూపు వాయిదాలు చెల్లించవచ్చు అని చెబుతోంది. ఇలా ఒక చందాదారుని లెక్కకు మించి చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా చూపిస్తోంది. దాంతో ఆ చందాదారు మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు భారీగా బకాయిలు పడేట్టు చేస్తోంది. అతి సామాన్య పూజారిని ఏకంగా 22 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చారు. మరో వ్యక్తిని ఏకంగా 60 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చినట్టు చెప్పారు. కానీ ఆయన ఏకంగా 90 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చూపించినట్టు సోదాల్లో వెల్లడైంది. ఇలాంటి అక్రమాలకు అంతే లేదు. ఆ చందాదారుడు ఓ చిట్టీలో పాటపాడినప్పటికీ అతి తక్కువ అంటే నామమాత్రంగానే ప్రైజ్‌మనీ పొందుతున్నారు. ఎంతగా అంటే రూ.50 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడైన ఓ చందాదారుడు రూ.46 లక్షలకు చిట్టీ పాట పాడితే ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతికి ఇచ్చింది కేవలం రూ.20 మాత్రమే. మరో చందాదారుడు రూ.18 లక్షలకు చిట్టీ పాట పాడితే చేతికి వచ్చింది కేవలం రూ.200. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఇలాంటి అక్రమాలు కుప్పలు కుప్పలుగా బయటపడుతున్నాయి.

### 3 చోట్ల చీటింగ్ కేసులు నమోదు

చీరాల, అనకాపల్లి, రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేశారు. మూడు చోట్ల బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్)లతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమన్యాంపై వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆ మూడు బ్రాంచిల మేనేజర్లను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిని అరెస్టు చూపించి న్యాయస్థానంలో హాజరు పరుస్తామని సీఐడీ అదనపు డీజీ సంజయ్ తెలిపారు.

- ▶ సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారునిగా నమోదు చేసినందుకు చీరాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.
- ▶ అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తర్వాత ఆయన రూ.4,61,989కు చిట్టీ పాడారు. ఆయన ఎన్నిసార్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తం ఆయన ష్యూరిటీ ఇచ్చిన మిగిలిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని చెప్పినా, బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలు చూపించారు. ఆ కాపీలు కావాలని అడిగినా సరే ససేమిరా అన్నారు. దాంతో వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.
- ▶ కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజ మహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించాక 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కానీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్ ఫండ్స్ మేనేజర్ తిరస్కరించారు. విజయ్ కుమార్ తన స్నేహితుడు మల్లి కార్జున రావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ఆయనకు ప్రైజ్‌మనీ ఇవ్వమని చెప్పారు. అసలు మల్లికార్జునరావు చిట్టీ మొత్తం గడువు తీరనే లేదని తెలిసింది. తనను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజ మాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

## మార్గదర్శి ఓ ‘నల్ల’ ఖజానా

- బ్రాంచి మేనేజర్ల పేరిట భారీగా బినామీ ఆస్తులు
- ఓ మేనేజర్ పేరిట రూ.100 కోట్ల ఆస్తి
- రూ.కోటి డిపాజిట్‌కు పైబడి వెయ్యి ఖాతాలు

మార్గదర్శి చిట్ ఫండ్స్ నల్ల కుబేరుల అడ్డా అన్నది బట్టబయలైంది. తవ్వేకొద్దీ అక్రమాలు పుట్టలు పుట్టలుగా వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో అక్రమ సంపాదనను దాచుకునేందుకు రామోజీరావు సృష్టించిన ఓ మినీ స్విస్ బ్యాంకు అని ఆధారాలతో స్పష్టమవుతోంది. ఉభయతారకంగా నల్లకుబేరులు, రామోజీరావు ఈ బ్లాక్ మనీ దందా సాగిస్తున్నారన్నది తేటతెల్లమవుతోంది. మరోవైపు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు చందదారుల సొమ్మును భారీగా తమ సొంతానికి మళ్లించుకున్న గుట్టు కూడా రట్టు అవుతోంది. శని, ఆదివారాల్లో స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో ఈ వ్యవహారం వెలుగు చూసింది. మనీ లాండరింగ్ జరుగుతున్నట్టుగా వెల్లడి కావడం గమనార్హం. రూ.కోటి కంటే అధికంగా చిట్టీలు వేసిన, అక్రమ డిపాజిట్లు చేసిన వారు దాదాపు వెయ్యి మంది వరకు ఉన్నట్టు ఇప్పటి వరకు గుర్తించినట్టు సమాచారం. వారి మార్గదర్శి లెడ్జర్ పుస్తకాల్లోగానీ, ఆ చందాదారులకు ఇచ్చిన పాస్‌బుక్‌లోగానీ వారి పాన్ నంబర్లు, ఆధార్ నంబర్లు నమోదు చేయనే లేదన్నది వెల్లడైంది. కొందరు చందాదారులను సీఐడీ అధికారులు పిలిచి విచారించగా వారికి అన్ని కోట్ల రూపాయలు ఏలా వచ్చాయన్నది చెప్పలేకపోయారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను ఆన్‌లైన్ ఖాతాల్లో ఎందుకు లింక్ చేయలేదని మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ప్రశ్నిస్తే వారు విస్మయకర సమాధానమిచ్చారు. ఈ అక్రమాల్లో మేనేజర్లు కీలక పాత్ర పోషిస్తున్నట్టు స్పష్టమైంది. రాష్ట్రంలోని ముఖ్య పట్టణంలోని ఓ బ్రాంచి మేనేజర్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. దాంతో రామోజీరావుతోసహా మొత్తం మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం హడలెత్తిపోయింది. ఆ మేనేజర్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట దాదాపు రూ.100 కోట్ల వరకు ఆస్తులు ఉన్నట్టు వెల్లడైంది. ఈ మేనేజర్ చాలా మంది పెద్దలకు బినామీ అన్నది స్పష్టమవుతోంది. ఇలా పలువురు మేనేజర్లు ఉన్నట్టు సమాచారం. కాగా, కొందరు బ్రాంచి మేనేజర్లు చందాదారుల చందా మొత్తాలను తమ సొంతానికి వాడుకుంటున్నట్టు కూడా వెల్లడైంది. విశాఖపట్నంలో దీనిని నిర్ధారించారు. ఇతర బ్రాంచి కార్యాలయాల్లో ఆరా తీస్తున్నారు. పలు చోట్ల అవకతవకలకు సంబంధించి లెడ్జర్ ఖాతాలు, చిట్టీ పాటల మినిట్స్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

## కొనసాగుతున్న విశ్వశాంతి యాగం



**జడ్చర్ల టౌన్:** విశ్వశాంతి యాగ మహోత్సవం అతిరుద్రం ఆయుత చండీహోమం ఆదివారం కొనసాగింది. కృష్ణపీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవంలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యపూజలతోపాటు సూర్య, సరస్వతీ, ధైర్యలక్ష్మి హోమాలు చేశారు. విశేషంగా సూర్య నమస్కారాలు చేయించారు. సాయంత్రం సరస్వతీ, బాలపూజలు (8ఏళ్లలోపు బాలికలను బాలాత్రిపుర సుందరిగా భావించి) పూజలు చేశారు. సోమవారం అమృత పాశుపతాస్త్ర మృత్యుంజయ రుద్ర, విజయలక్ష్మీహోమాలు నిర్వహించనున్నారు. అలాగే దశ సహస్ర (10వేలు) లింగాలకు అభిషేకాలు, రుద్రక్రమార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర జ్యోతిలింగార్చనలు చేయనున్నారు. ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుప్తనిధుల వేటలో శిథిలం

- కనుమరుగువుతున్న రామలింగేశ్వరాలయం
- ధ్వంసమైన ఆలయం, విగ్రహాలు

**అడ్డాకుల:** మూసాపేట మండల కేంద్రంలో సహజ సిద్ధంగా ఏర్పడిన రామస్వామి గుట్టపై రాష్ట్రకోట, కల్యాణ చాళుక్య, కాకతీయుల కాలంలో స్తంభాలన్నీ కలగలిపి 17వ శతాబ్దంలో పునర్నిర్మించిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం గుప్త నిధుల వేటలో ధ్వంసమైంది. అంగరంగవైభవంగా వెలగొందిన ఆలయం నుంచి కింద ఉన్న కోనేరు వరకు రాతి మెట్లను ఏర్పాటు చేశారు. పూర్వ కాలంలో ఇక్కడ జాతర కొనసాగేది. ఈక్రమంలో 30, 40ఏళ్ల క్రితం నుంచి ఆలయంలో గుప్త నిధుల వేట మొదలైంది. ఆలయం లోపలి పరిసరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. శివలింగాలు, చెన్నకేశవ శిల్ప సంపద, కాకతీయుల కాలం నాటి సరస్వతి, కాలభైరవ శిల్పాలను పెకిలించి ధ్వంసం చేశారు. పెద్ద పెద్ద గోతులను తవ్వారు.


మూసాపేట రామస్వామి గుట్టపై ఉన్న రామలింగేశ్వరాలయం

ఆలయం నుంచి బయటకు తీసిన శివలింగం

### మరో రెండు ఆలయాల్లో..

గుట్టపై వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయం పక్కనే ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ కూడా గుప్త నిధుల వేట సాగడంతో ధ్వంసమైంది. గుట్టపై నుంచి ఆలయం కింద పెద్ద కోనేరు ఉండగా అక్కడి వరకు రాతి మెట్లను నాడే ఏర్పాటు చేశారు. కోనేరు వద్ద గణపతి ఆలయం ఉండగా అక్కడ కూడా తవ్వకాలు చేశారు. పూర్వ కాలం నాటి గుడి, విగ్రహాలు ధ్వంసమై ఆలయ చరిత్ర కనుమరుగు అవుతుంది. ఇప్పుడిప్పుడే గ్రామస్తులు ఏకమై అయ్యప్ప గుట్ట నుంచి రామస్వామి గుట్ట మెట్ల దారి వరకు రాళ్లను తొలగించి దారి వేయించారు. శిథిలమైన ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు నడుం బిగించారు. పురావస్తుశాఖ అధికారుల దృష్టికి ఆలయ చరిత్రను తీసుకెళ్లి ఆలయాన్ని పునర్నిర్మించడానికి గ్రామస్తులు కృషి చేస్తున్నారు.


కోనేరు వద్ద ఉన్న గణపతి ఆలయంలో తవ్వకాలతో ఏర్పడిన గుంతలు


ధ్వంసమైన ఆంజనేయస్వామి ఆలయం


కోనేరు నుంచి గుట్టపైకి ఉన్న మెట్ల దారి

# ముస్లింలు ఏకతాటిపైకి రావాలి


ఆత్మకూర్‌లో డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న నాయకులు

- 40 నియోజకవర్గాల్లో అత్యధిక శాతం ఓట్లు మైనార్టీలవే..
- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్
- ఆత్మకూర్‌లో ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభలో వక్తల పిలుపు

**ఆత్మకూర్:** పార్టీలు, వర్గాల రహితంగా అందరూ ఏకమైతేనే హక్కులను సాధించుకుంటామని, ఇప్పటికే పలు సందర్భాల్లో ఏర్పాటు చేసిన కమిషన్‌లు ముస్లింల వెనుకబాటుతనాన్ని స్పష్టంగా తేల్చిచెప్పాయని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. ఆదివారం రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్ ఆవిష్కరణ సంకల్ప సభను పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు న్యాయమూర్తితో పాటు జాక్ రాష్ట్రకన్వీనర్ సయ్యద్‌సలీంపాష, రచయిత స్కైబాబ, యూనస్‌పర్వేజ్, షేక్ హనీఫ్, సయ్యద్‌నవాజ్, ప్రొ.అన్వర్‌ఖాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, మహమూద్ మాట్లాడారు. రాష్ట్రంలో ముస్లింల కమ్యూనిటీ పెద్ద సమూహమని దాదాపు 15శాతం ఓట్లు కలిగి ఉన్నారన్నారు. 40 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేసే నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారన్నారు. ముస్లింలను రాజకీయంగా ఎదగకుండా కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారన్నారు. నామినేటెడ్ పదవులు, బడ్జెట్ కేటాయింపు, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, సబ్సిడీ రుణాలు ఇలా అన్నిరంగాల్లో అడుగడుగున అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశబూరు. జస్టిస్ సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్ర కమిషన్, సుధీర్ కమిషన్, తెలంగాణ తొలి బీసీస కమిషన్లు ముస్లింల వెనుకబాటుతనాన్ని స్పష్టంగా తేల్చి చెప్పాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో ముస్లింలు దళితులకన్న వెనుకబడి ఉన్నారని, విద్య, ఉద్యోగ రంగాల్లో, ఉండడానికి ఇళ్లు లేక అట్టడుగున పడి అల్లాడుతున్నారని గణంకాలతోసహ జస్టిస్ సచార్ కమిటీ నివేదించిందని వివరించారు.

### కర్ణాటక ఎన్నికలవలే సిద్ధం కావాలి..

రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో డిక్లరేషన్‌లో పొందుపర్చిన 22 డిమాండ్లను తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో పొందుపర్చి అమలుకు చిత్తశుద్ధితో ముందుకెలుతారో వారికే కర్ణాటక తరహాలో ముస్లింలు ఏకతాటిపై నిలిచి తమ ఓటు ప్రాధాన్యతను తెలియపర్చాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పండుగలువస్తే ఇఫ్తార్ ఖావో.. సబ్‌కుచ్ భూల్ జావో అనే చందంగా పరిస్థితి దాపురించిందని, ముస్లింలను చులకనగా చూస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుచేసే విషయంలో రాష్ట్రాలకే రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం కల్పించిందని, తెలంగాణ ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ నేటివరకు అమలుకాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 22 డిమాండ్లను పరిష్కరించాలి..

జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున 10 అసెంబ్లీ టికెట్లను ముస్లింలకు అన్ని పార్టీలు కెటాయించాలని, 12 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని, వార్షిక బడ్జెట్‌లో రూ.10వేలకోట్లు కేటాయించాలని, వక్ఫ్ బోర్డు కమిషనరేట్‌ను ఏర్పాటుచేసి భూములు, ఆస్తులను పరిరక్షించాలని, మైనార్టీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, కళాశాలలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. రెండవ అధికార భాష అయిన ఉర్దూకు ప్రాధ్యాన్యత ఇవ్వాలని, పేద ముస్లిం కుటుంబాలకు రూ.10లక్షలు ఆర్థిక సాయం అందించాలన్నారు. 33 జిల్లాల్లో 66 మెట్రిక్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని, ఇఫ్తార్ దావత్‌లకు చేసే ఖర్చును సీఎం నిధుల నుంచి కేటాయించాలని, మసీదుల మరమ్మతులకు నిధులను కేటాయించాలన్నారు. మొహతర్ కమ్యూనిటీని ఎస్సీ క్యాటగిరిలో చేర్చాలని, జస్టిస్ సచార్, సుధీర్ కమిషన్‌ల సూచనలను పాటించాలని, ఎన్ఆర్సీ, సీఏఏ చట్టాలను వ్యతిరేకించాలని, ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు పెంచాలని, ఖబరస్తాన్‌లకోసం భూములు కేటాయించాలన్నారు. మెదక్ పోలీసుల చేతుల్లో చిత్రహింసలకు గురై మృతిచెందిన ఖాదర్ కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం సామాజిక వేత్త ఖలీదా పర్వీన్, గయాసుద్దీన్, అబ్దుల్‌గని, షబ్బీర్, యూసుఫ్, హఫీజ్ ముక్తదీర్, ఫహీమ్, షాహిద్, కలీ, అబ్దుల్‌వాహేద్, జంషీద్, ఖాజపాష, మహిమూద్, సత్తార్ పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న విజయేంద్ర యడ్యూరప్ప

**జడ్చర్ల:** ప్రధానమంత్రి మోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కర్ణాటక రాష్ట్రం శికారిపుర నియోజకవర్గ ఎమ్మెల్యే విజయేంద్ర యడ్యూరప్ప తెలిపారు. ఆదివారం పట్టణ సమీపంలోని ఓ హోటల్‌లో నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బూత్ స్థాయిలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని, బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ డబ్బులు వెదజల్లి గెలిచారని, అదే ఫార్ములాను రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. డీకే శివకుమార్ అంటేనే డబ్బు అని గుర్తు చేశారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ రాజు పాల్గొన్నారు.

### దేశాన్ని పాలించే సత్తా బీజేపీకే ఉంది..

**భూత్పూర్:** దేశాన్ని పాలించే సత్తా బీజేపీకే ఉందని కర్ణాటక ఎమ్మెల్సీ తేజశ్వినిగౌడ అన్నారు. ఆదివారం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ అసెంబ్లీ ప్రవాస్ యోజన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, సత్యయ్య పాల్గొన్నారు.

### నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలు

మండలాధ్యక్షుడి ఎన్నికలో తమకు సమాచారం లేకుండా నియమించారని, సీనియర్లు, జూనియర్లు తేడాలు కల్పించి మండలాధ్యక్షుడి ఎన్నిక ఎలా చేస్తారని నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎదుట వాగ్వివాదానికి దిగారు. పార్టీ కోసం పనిచేస్తూ, గ్రామాల్లో బలోపేతం చేసేవారిని గుర్తించి రూరల్ మండల అధ్యక్షుడి ఎంపిక చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మధ్య ఉండని వారిని అధ్యక్షుడిగా ఎంపిక చేయడం తగదని కొందరు నాయకులు ఆరోపించారు. వర్గాలు అనే విభేదాలు తేస్తే బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని నాయకులు హెచ్చరించారు.

# సమస్యలు వింటూ.. హామీలిస్తూ

**జడ్చర్ల:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాహిత పాదయాత్ర ఆదివారం మిడ్జిల్ మండలం నుంచి జడ్చర్లలోకి ప్రవేశించింది. మండలంలోని కుర్వగడ్డపల్లి, అల్వాన్‌పల్లి, తంగెళ్లపల్లి, నసరుల్లాబాద్‌లో పాదయాత్ర కొనసాగింది. మీనాంబరం ఆలయంలో పరశువేదీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాలలో ప్రజా సమస్యలను వింటూ.. హామీలు ఇస్తూ ముందుకు సాగారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి పతనం తప్పదని, వచ్చే ఎన్నికలలో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందుల పాలు చేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే భూమి లేని నిరుపేదలకు రూ.12లక్షల సాయం అందజేస్తామని, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, డబుల్‌బెడ్‌రూమ్ ఇంటికి రూ.5లక్షల సాయం చేస్తామన్నారు.


కుర్వగడ్డపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

# మైసమ్మ ఆలయంలో జడ్జి పూజలు

**నవాబుపేట:** పర్వతాపూర్ మైసమ్మ ఆలయాన్ని ఆదివారం ఎక్సైజ్, ప్రొవిజన్ కోర్టు జిల్లా జడ్జి శ్రీదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పూజారులు, కమిటీ చైర్మన్ కృష్ణయ్య ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి.. తీర్థప్రసాదాలు అందించారు. ఆమె వెంట ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు మాధవులు, నరేందర్ తదితరులున్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి